క్లుప్తంగా

హరితహారం పనుల పరిశీలన

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం కార్యక్రమంలో భాగంగా సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం లక్ష్మీతండాలోని సంపద వనాన్ని పరిశీలించారు. ఎస్సారెస్పీ కాలువల వెంట మొక్కలు నాటేందుకు జరుగుతున్న బౌండరీ ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమేష్, ఏపీఓ వెంకన్న, ఏఈలు కిరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

'ఇస్రో' అక్షరాల ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన



ఇస్రో అక్షరాల ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

అర్వపల్లి : చంద్రయాన్-3 విజయవంతం కావడాన్ని హర్షిస్తూ గురువారం అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలో బాలికలు ఇస్రో అక్షరాల ఆకారంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ శిరీన్ మహమ్మద్, సీఆర్‌టీలు పుష్పలత, సునీత, శ్రీలత, రామకళ, అనూష, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి



కాసర్లపహాడ్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యసిబ్బంది

అర్వపల్లి : రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జాజిరెడ్డిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండలంలోని కాసర్లపహాడ్‌లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, అటెండర్ యాదగిరి, యాకస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం కోటినాయక్‌తండా, గట్టికల్, నెమ్మికల్, పాత సూర్యాపేట, కందగట్ల, పాతర్లపహాడ్, ఇస్తాలపురం, బోరింగ్ తండా, ఆత్మకూరు పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత నమోదును చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచాల శ్యామ్, మందాటి అశోక్, జిల్లా జానయ్య, వెంకన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

నూతనకల్ : రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ రూ. లక్ష రుణమాఫీ కావడం లేదని తెలిపారు. బ్యాంకుల్లో రూ. 99వేల 999లు అప్పు తీసుకున్న వారికే రుణమాఫీ అవుతుందని, రూ.లక్ష తీసుకున్న వారికి కావడంలేదని అన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల 20లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాకుండా పోతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు ప్రచార ఆర్భాటం కోసం తప్పా రైతులకు రుణమాఫీ చేయడంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తీగల కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, మేడిపల్లి అశోక్, ముత్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి మాట్లాడారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను కోరారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చాంప్లానాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత దారులు

- చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారుతున్న గ్రామాల వీధులు
- డ్రెయినేజీలు సరిగాలేక రోడ్లపైనే నిలుస్తున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మల్యాతండాలో అధ్వానంగా ఉన్న రహదారి



వాల్యతండాలో..

చివ్వెంల : చివ్వెంల మండలంలోని గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వీధులన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని వాల్యతండా, పాశ్యానాయక్‌తండా, బద్యాతండా, ఎర్ర సూర్యాతండా, రోళ్లబండ తండా, మల్యాతండా, వెంకట్‌తండా, రాజుతండా, పాండ్యానాయక్‌తండా, మోదిన్‌పురం గ్రామాల్లో అంతర్గత రోడ్లు గుంతమయంగా మారాయి.

చిన్న వర్షానికే చిత్తడి...

గ్రామాల్లో చిన్న వర్షానికే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. గ్రామాల్లో కాలినడక కూడా వెళ్లలేని విధంగా అంతర్గతదారులు బురదమయం అవుతున్నాయి. గుంతల్లో మురుగునీరు చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వేసవిలో దుమ్ము, వర్షాకాలంలో బురదతో సహజీవనం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

కొరవడిన మురుగు కాల్వల నిర్వహణ..

పులితండా, జయరాం గుడితండా, లక్ష్మణ్‌నాయక్ తండా, అక్కలదేవిగూడెం, గుంపుల, బి.చందుపట్ల, ఐలాపురం, గాయంవారిగూడెం గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగు నీరంతా వీధుల్లోని రోడ్ల పైకి చేరుతుంది. ఫలితంగా దుర్వాసన వస్తోంది. కొన్ని గ్రామాల్లోని వీధుల్లో మురుగు కాలువలు కూడా నిర్మించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తండాలో సీసీ రోడ్లు నిర్మించాలి

తండాలోని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. వర్షాకాలం వస్తే గ్రామంలోని వీధుల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీరు నిలవ్వడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– శ్రీను, మల్యాతండా

అధికారులను కోరాం

గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని అధికారులను కోరాం. చిన్న వర్షాలకే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సోమయ్య, మోదినపురం

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులతో ఎమ్మెల్యే

అర్వపల్లి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల అడ్రస్ గల్లంతు అవుతుందని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో అర్వపల్లికి చెందిన మత్స్యకార్మిక సంఘం చైర్మన్ మామిడి రవి, కాంగ్రెస్ నాయకులు మనుబోతుల నరేష్, నోముల వీరనర్సయ్య, కడెం వెంకటయ్య, కడెం శ్రీను, వాకిటి శ్రీను, బైరు నరేష్, ఈదుల అర్వపల్లి, బింగి సాయి, మామిడి లింగయ్య, పేరబోయిన వినయ్‌లతో పాటు కొంతమంది గురువారం ఎమ్మెల్యే కిషోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ సీహెచ్.విద్యాసాగర్, పులిచెర్ల ప్రభాకర్, కదారి నరేష్, డాక్టర్ కిరణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న నియోజకవర్గ సెంట్రల్ ఇన్‌చార్జ్ ఆర్‌బీ అశోక్‌బాబు

పెన్‌పహాడ్ : కేంద్రం, రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని ఆ పార్టీ నియోజకవర్గ సెంట్రల్ ఇన్‌చార్జ్, పాండిచ్చేరి ఎమ్మెల్యే ఆర్‌బీ అశోక్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సత్య గార్డెన్స్‌లో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందన్నారు. చేసిన పాపాలు పండి బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని తెలిపారు. తెలంగాణలో పేదవారి సొంతింటి కల నెరవేరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు, మండల అధ్యక్షుడు పోకల రాములు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కర్నాటి కిషన్, పోకల వెంకటేశ్వర్లు, కట్కూరి కార్తీక్, చెన్ను రమణారెడ్డి, ఘట్కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సలిగంటి వీరేంద్ర, సాయి, నరహరి, బొలిశెట్టి భిక్షమయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ వెలుగుల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



అర్వపల్లిలో హైవేపై వెలుగుతున్న సెంట్రల్ లైట్లు

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై అర్వపల్లి వైజంక్షన్ నుంచి జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి రోడ్లలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు కొంతకాలంగా పనిచేయక అర్వపల్లి అంధకారంగా మారింది. దీంతో పనిచేయని సెంట్రల్ లైటింగ్ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కాగా జాతీయ రహదారుల విభాగం అధికారులు స్పందించారు. రెండు రూట్లలో పనిచేయని సెంట్రల్ లైట్లకు మరమ్మతులు చేయించారు. కొత్తలైట్లు ఏర్పాటు చేశారు. దీంతో రెండురూట్లలో సెంట్రల్ లైట్ల వెలుగులు విరజిమ్ముతున్నాయి. కాగా కొంతమంది ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు రాత్రి వేళలో తమ ట్రాక్టర్లు కనిపించకుండా సెంట్రల్ లైట్లను పాడుచేస్తున్నారని ఎన్‌హెచ్ విభాగం డీఈఈ ధరావత్ బాలునాయక్ తెలిపారు. సెంట్రల్ లైట్లకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

29 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

నాగారం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో విద్యార్థులకు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 29న బాలికలకు, 30న బాలురకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నియోజకవర్గస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే కిషోర్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం



అర్వపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

అర్వపల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గాదరి కిషోర్‌కుమార్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం సీతారాంపురం గ్రామ బీఆర్ఎస్ నాయకులు అర్వపల్లిలో ర్యాలీ నిర్వహించారు. మూడోసారి కిషోర్‌కు టికెట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడు బందెల వెంకన్న, నాయకులు బందెల వెంకటయ్య, భరత్‌కుమార్, మాతంగి జనార్దన్, డి.మహేష్, గడ్డం బుచ్చిరాములు, బి.మనోజ్, జి.శ్రీకాంత్, బి.వరశురాములు, బి.యల్లయ్య, బి. పరశురాములు, ఎం.లక్ష్మణ్, బి.ప్రశాంత్, ఎం.ప్రవీణ్, అంకిరెడ్డి భద్రయ్య, రాసాల సైదులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి : బీఆర్ఎస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు కేవలం 23 టికెట్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు మాట్లాడారు. పది శాతం ఉన్న ఓసీ సామాజిక వర్గానికి 60 శాతం కేటాయించి, 60 శాతం ఉన్న బీసీలకు 23 శాతం కేటాయించడమేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందని విమర్శించారు. ఇకనైనా పునః పరిశీలించుకొని బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లు బీసీ కులాలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొత్తగట్టు మల్లయ్య, మహేష్ గౌడ్, చంటి, చారి, శ్యామ్ యాదవ్, బ్రహ్మం, గణేష్, ఉపేందర్, కిరణ్, యాదగిరి, శ్రీనివాస్, మహేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తికావొస్తున్న గృహలక్ష్మి దరఖాస్తుల సర్వే



ఉయ్యాలవాడలో సర్వే చేస్తున్న కార్యదర్శి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో గృహలక్ష్మి పథకం కోసం ప్రజల నుంచి 1745 దరఖాస్తులు రాగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల వారీగా చేస్తున్న ఇంటింటి సర్వే పూర్తి కావొస్తుంది. దరఖాస్తుదారుల ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇళ్లు, స్థితిగతులను పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. అన్ని గ్రామాల్లో సర్వే జరుగుతుందని.. ఈ సర్వే పూర్తికాగానే నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్ఐ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

- వినియోగంలోకి రాని ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదులు
- ప్రారంభం కాకుండానే శిథిలమవుతున్న భవనం



పిచ్చిమొక్కల మధ్యలో ఉన్న నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదుల భవనం

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం నిర్మించిన అదనపు గదులు వినియోగంలోకి రావడం లేదు. ఈ భవన నిర్మాణం పూర్తయి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ఇంతవరకు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రారంభం కాకుండానే భవనం శిథిలమవుతోంది. చెత్తాచెదారం.. చుట్టూ పిచ్చి మొక్కలతో శిథిలావస్థలో ఉన్న భవనంలా మారిపోతుంది. అయితే గురుకుల పాఠశాలకు భవనం నిర్మించాల్సి ఉండగా.. అద్దె భవనంలో నెలకు రూ.1.50లక్షలు వెచ్చించి నడిపిస్తున్నారు. కానీ జూనియర్ కళాశాలకు అదనపు గదులు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాకపోవడం గమనార్హం.

రూ.కోటి 30 లక్షలతో నిర్మాణం..

మండలంలో ఇంటర్ విద్యార్థుల కోసం నెమ్మికల్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు ఏటేటా ఎక్కువగా వస్తున్నారు. ఈ క్రమంలో అదనపు గదులు అవసరం ఉంటాయని ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న కళాశాలకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఖాళీస్థలంలో అదనపు గదులను నిర్మించాలని భావించింది. దాదాపుగా రెండు అంతస్తుల్లో ఒక్కో అంతస్తుకు పది గదుల చొప్పున మొత్తం 20 గదులతో ఈ భవన నిర్మాణ పనులు మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అయితే నాటి నుంచి ఈ విద్యా సంవత్సరం వరకు కూడా ఈ అదనపు గదులు విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. దీంతో దుమ్ము, ధూళి, చెత్తాచెదారం చేరి నూతన భవనం కాస్త పాతపడిపోతుంది. తక్షణమే ఈ భవనాన్ని విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి నాయకులు కోరుతున్నారు.

తరగతులు నిర్వహించాలి



మండలంలోని చాలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదనపు గదులు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాకపోవడం సరైంది కాదు. వెంటనే నూతన గదుల్లో తరగతులు ప్రారంభించాలి.

– యాకూబ్‌రెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న వికలాంగులు

పెన్‌పహాడ్ : వికలాంగుల పింఛన్ రూ. 4016కు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల పరిధిలోని ధర్మాపురంలో సీఎం కేసీఆర్, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు చెవుగాని అంజయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దొంగరి లింగస్వామి మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం శ్రీను, బీఆర్ఎస్ నాయకులు చేరాల శ్రీనివాసాచారి, సాలం సత్యనారాయణ, దొంగరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పింఛన్ల పంపిణీ



అనంతారంలో పింఛన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ

పెన్‌పహాడ్ : సీఎం కేసీఆర్ సమాజంలో వికలాంగుల గౌరవాన్ని మరింత రెట్టింపు చేశారని జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో వికలాంగులకు రూ.4016ల పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం వికలాంగులకు ఇస్తున్న రూ. 3016 పింఛన్‌ను రూ. 4016కు పెంచి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి పరందాములు, కట్ల నాగార్జున, చిట్టెపు నారాయణరెడ్డి, దంతాల వెంకటేశ్వర్లు, పొదిల నాగార్జున, మైబెల్లి, మస్తాన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ యాదగిరిరెడ్డి

తుంగతుర్తి : ఈ నెల 21న ప్రకటించిన ఓటరు జాబితాపై గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో, బీఎల్‌ఓలతో తహసీల్దార్ యాదగిరిరెడ్డి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 21న ప్రచురించిన ఓటరు జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 19వ తేదీలోగా దరఖాస్తులు చేయాలని అన్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించి ఓటరు జాబితాను సెప్టెంబర్ 28లోగా ప్రచురించి, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రకటించిన తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పండుగ

మునగాల: మండల కేంద్రంలో గురువారం ముత్యాలమ్మ పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించగా, పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

అద్దంకి దయాకర్‌కు టికెట్ ఇస్తే రాజీనామా చేస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే కార్యకర్తలందరం మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేస్తామని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లేపాక రవీందర్‌మాదిగ అన్నారు. గురువారం పసునూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అద్దంకి దయాకర్‌కు గతంలో రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఓడిపోయాడని అన్నారు. ఎన్నికల్లో ఓడిన నాటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గానికి వచ్చిన పాపాన పోలేదని తెలిపారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. అద్దంకి దయాకర్‌కు మినహాయించి పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా వచ్చే ఎన్నికల్లో ఆ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించే ముందు నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలు సేకరించి టికెట్ కేటాయించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు అద్దంకి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తలూరి వెంకటయ్య, కమటం శ్రీనివాస్, మల్లేపాక దుర్గయ్య, మల్లేపాక సుకకార్, నరాల నాగయ్య, నరాల శ్రీను, కోడి భిక్షం, మల్లేపాక రామలక్ష్మయ్య, నరాల గోపి, మామిడి చెన్నయ్య, మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ కేటాయించాలి

- భాషపంగు భాస్కర్

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకే అవకాశం ఇవ్వాలని భాషపంగు భాస్కర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాజు, ఈదుల రమేష్‌చంద్ర, ఉద్దంగుల రాజు, పాల్వాయి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

మద్దిరాల : గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తీగల సత్యగౌడ్ మాతృమూర్తి భిక్షమమ్మ ఇటీవల మరణించింది. దీంతో గురువారం మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడ్ల వెంకన్న, కన్న వీరన్న, తీగల వెంకన్నతోపాటు మరికొంత మంది హైదరాబాద్‌లోని సత్యగౌడ్ నివాసంలో భిక్షమమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం తీగల సత్యగౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తీగల వెంకన్నగౌడ్, మోడెం వెంకన్న, వెంపటి మల్లేష్, ఉపేందర్, గడ్డం సిద్ధయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి గ్రామపంచాయతీ ఆవాసం సీతారాంపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఓర్సు యల్లయ్య గురువారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహానికి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, బందెల అర్వపల్లి, అరిగె వెంకన్న, సుంకరి వెంకన్న, బత్తుల వెంకటేశ్వర్లు, చిత్రాల వీరయ్య, బందెల భరత్‌కుమార్, బందెల వెంకన్న పాల్గొన్నారు.


విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కోదాడ : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు శ్రీపతిరెడ్డి, ప్రమీల కోరారు. గురువారం కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా విభాగం, తిరుమల పారా మెడికల్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్ తీసుకోవద్దన్నారు. విద్యార్థులు రక్తదానం చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీనివాస్, జోత్స్న, దేవమణి, లక్ష్మీనారాయణ, యాదగిరి, బలభీమారావు, ప్రభాకర్‌రెడ్డి, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలోని గడ్డ తొలగింపు

సూర్యాపేట : సూర్యాపేటలోని హెల్త్‌షై హాస్పిటల్‌లో కిడ్నీకి సంబంధించిన రీనల్ సెల్ కారియోనోమ వ్యాధి ఆపరేషన్‌ను గురువారం దిగ్విజయంగా నిర్వహించారు. వైద్యసిబ్బంది తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా భీమారం గ్రామానికి చెందిన బండి పాపిరెడ్డి రెండేళ్లుగా కిడ్నీ నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. పైగా ఇటీవల మూత్రంలో రక్తం కూడా వస్తుండడంతో వెంటనే హెల్త్‌షై హాస్పిటల్‌కి వచ్చి పరీక్షలు చేయించుకున్నాడు. దీంతో అతడి కిడ్నీలో గడ్డ ఉందని వైద్యులు గుర్తించి ఆపరేషన్ చేయాలని పేర్కొన్నారు. దీంతో పేషంట్ ఆపరేషన్‌కు సిద్ధమవగా హెల్త్‌షై ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా ఆపరేషన్ చేసి కిడ్నీలోని గడ్డను తొలగించారు. అనంతరం ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ దీపక్‌కుమార్, మతకాల చలపతిరావు మాట్లాడుతూ హెల్త్‌షై ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఓయూ పీజీ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంకులు



నాగరాజు



యల పూజ

నాగారం : ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన పీజీ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో మండలవాసులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఫణిగిరి గ్రామానికి చెందిన సంపతి నాగరాజు ఎంఏ తెలుగు విభాగంలో 47వ ర్యాంకు, ఈటూరు గ్రామానికి చెందిన యల పూజ స్టాటిస్టిక్స్ విభాగంలో 52వ ర్యాంకు సాధించారు.

కోదాడలో కాంగ్రెస్ విజయం ఖాయం

కోదాడ : రానున్న ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని, తాను కోదాడలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నానని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి తెలిపారు. గురువారం ఎంఎస్ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకు మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గత నెల రోజులుగా నియోజకవర్గంలో పర్యటించినట్లు తెలిపారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ అవకాశం ఇస్తే తాను పోటీ చేస్తానని, 40 వేల మెజార్టీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పందిరి ఫౌండేషన్ సలహాదారు ఎస్ఎస్ రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.